




# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 16-12-2023 సంపుటి : 06 సంచిక : 96 పేజీలు : 8 వెల : రూ 3-00


## కేంద్రబృందాలతో సీఎం జగన్ భేటీ



**రాష్ట్రంలో తుఫాన్, కరువుపై అధ్యయనం**
**నష్టాలను కేంద్రానికి నివేదిస్తామన్న కేంద్రబృందం**
**తుఫాన్ నష్టం అతిగా లేకుండా చర్యలు తీసుకున్నట్లు సిఎం వెల్లడి**
**వీలైనంత త్వరగా కేంద్ర సాయాం అందేలా చూడాలని వినతి**

అమరావతి,డిసెంబర్15: ముందస్తుగానే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం కావడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించగలిగారని కేంద్ర బృందం తెలిపింది. తుపాను కారణంగా జరిగిన పంట నష్టం, మౌలిక సదుపాయాలకు ఏర్పడ్డ నష్టాలపై సమగ్ర నివేదిక కేంద్రానికి సమర్పిస్తామని వెల్లడించింది. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై ఈ సమావేశంలో చర్చించిన కేంద్ర కమిటీ, తాము పరిశీలించిన అంశాలను కేంద్ర బృందం అధికారులు వివరించించింది. రాష్ట్రంలో వర్షాభావం, తుపాను అనంతర పరిస్థితులపై పరిశీలన చేసిన కేంద్ర బృందంతో క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైయస్.జగన్, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధి కారులు భేటీ అయ్యారు. తుపాను, కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన రెండు అధికారుల బృందాలతో ఈ సమావేశం జరిగింది. క్షేత్ర స్థాయిలో తాము గుర్తించిన అంశాలను కేంద్ర బృందం చర్చించింది. తుపాను బాధిత ప్రాంతాల్లో విస్తారంగా పర్యటించామంటూ తాము చూసిన పరిస్థితులను వివరించింది. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్ఐడీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ విక్రాంత్ సింగ్, డీఏఎఫ్‌డబ్ల్యూ జాయింట్ సెక్రటరీ పంకజ్ యాదవ్ సహా రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ స్పెషల్ సీఎస్ జి సాయి ప్రసాద్, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్, గ్రామీణాభి .వృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, రవాణాశాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్, విపత్తు నిర్వహణశాఖ డైరెక్టర్ అంబేద్కర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సచివాలయాల రూపంలో గ్రామస్థాయిలో బలమైన వ్యవస్థ ఉందన్న కేంద్రబృందం, విపత్తు వచ్చిన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో అనుసరిస్తున్న మార్గాలు బావున్నాయని తెలిపంది. ఇ-క్రాపింగ్ లాంటి విధానం దేశంలో ఎక్కడా లేదని తెలిపిన కేంద్ర బృందం, అవి ఇతర రాష్ట్రాలు అనుసరించదగ్గవని పేర్కొంది. వీటిగురించి ఆయా ప్రభుత్వాలకు తెలియజేస్తామని తెలిపింది. అనంతపురం జిల్లా నుంచి పర్యటన ప్రారంభమై మొత్తంగా ఏడు జిల్లాల్లో తిరిగామని వెల్లడించింది. మూడు బృందాలుగా జిల్లాల్లో పర్యటించి వర్షాభావ పరిస్థితులపై పరిశీలన చేశామన్న కేంద్ర బృందం అనంతపురం, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య, ఎన్టీఆర్ జిల్లాల్లో పర్యటించామని సభ్యులు తెలిపారు. వర్షాభావం కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించామనీ, స్థానిక రైతులతో మాట్లాడి వారి కష్టసుఖాలు తెలుసుకున్నామంది. వ్యవసాయం, ఉద్యానవన పంటలు, పశువులు, తాగునీరు తదితర అంశాలపై చర్చించారు. జలవనరులు పరిస్థితి, రిజర్వాయర్లలో నీటిమట్టాల పరిస్థితిని చూశామని వెల్లడించారు. అలాగే ఉపాధిహామీ పథకంపైనా పరిశీలన చేశామన్న కేంద్ర బృందం, ఆర్బీకేలు, ఉచిత పంటల భీమా, డీబీటీ పథకాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, కంటిజెన్సీ కింద విత్తనాలు పంపిణీ, అమూల్ పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా మిల్క్ కలెక్షన్ సెంటర్ల ఏర్పాటు, గ్రామ సచివాలయాల వ్యవస్థ ఇవన్నీకూడా తాము స్వయంగా చూశామని, ఈ కార్యక్రమాలు చాలా బాగున్నాయని వెల్లడించారు. కౌలు రైతులకు కూడా ఎక్కడా లేని విధంగా రైతు భరోసా అందించడం అభినందనీయం అని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లించేలా రైతుల్లో అవగాహన కల్పించాలని కేంద్ర బృందం సూచన చేసింది. పెసలు, మినుములు, మి÷-లలెట్స్ లాంటి ఇతర పంటలవైపు మళ్లేలా చూడాలని కేంద్ర ప్రభుత్వం సూచనగా చెప్పారు. .ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అధికారులు వివరించారు. ఉపాధిహామీ పథకం కింద విస్తారంగా కల్పిస్తున్న పనిదినాలపైనా కేంద్ర బృందానికి వివరాలు తెలిపారు.

## వచ్చే నెల నుంచే 3వేల పెన్షన్

**ఆరోగ్యశ్రీలో పరిమితి 25లక్షలకు పెంపు**
**విశాఖలోని 4 కారిడార్లలో మెట్రో నిర్మాణం**
**వైద్య కళాశాలల్లో నెఫ్రాలజీ, న్యూరాలజీ విభాగాల ఏర్పాటు**
**ఈ విభాగాల్లో 287 పోస్టుల భర్తీకి కేబినేట్ గ్రీన్ సిగ్నల్**
**ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలు**



అమరావతి,డిసెంబర్15 : పెన్షనర్లకు ఏపీ ప్రభుత్వంశు భవార్త తెలిపింది. వచ్చే జనవరి నుంచి సామాజిక పెన్షన్లు రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సీఎం జగన్ అధ్యక్షతన శుక్రవారం కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మొత్తం 45 అంశాలపై చర్చించిన ఏపీ కేబినెట్.. పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఆరోగ్య శ్రీలో చికిత్స పరిమితి రూ.25 లక్షల పెంపునకు ఆమోదం తెలిపింది. జనవరిలో వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల అమలు చేయనున్నట్లు పేర్కొంది. 'మిగ్ జాం' తుపాను నష్ట పరిహారం అందించేందుకు ఆమోదం తెలిపింది. విశాఖ లైట్ మెట్రో ప్రాజెక్ట్ కు కేబినెట్ ఆమోదం, అలాగే విశాఖలోని 4 కారిడార్లలో మెట్రో నిర్మాణానికి ఆమోదం తెలిపింది. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతకు మంత్రివర్గం ఆమోదం లభించింది. కేబినేట్ వివరాలను మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వెల్లడించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరులో సంస్కరణల కు ఆమోదం ఇచ్చింది. వైద్య కళాశాలల్లో నెఫ్రాలజీ, న్యూరాలజీ విభాగాల ఏర్పాటుకు ఆమోదం, అలాగే ఈ విభాగాల్లో 287 పోస్టుల భర్తీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శ్రీకాకుళం, కాకినాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, అనంతపురం వైద్య కళాశాలల్లో అంకాలజీ విభాగం ఏర్పాటుకు నిర్ణయిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ సీసీ టీవీ సర్వైలెన్స్ ప్రాజెక్టుతో పాటు వివిధ జిల్లాల్లో రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ల ఏర్పాటు కోసం రూ.552 కోట్ల రుణ సేకరణకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో పేదలకు రూ.25 లక్షల వరకూ ఉచితంగా వైద్యం ఆమోదిస్తూనే.. 90 శాతం కుటుంబాలకు ఆరోగ్య శ్రీ సేవలు అందనున్నాయని వెల్లడించారు. ఈ నెల 18 నుంచి ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేస్తారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై విస్తృతంగా అవగామన కల్పించాలని సీఎం జగన్ ఆదేశించారు. జనవరి 1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతకు కేబినెట్ ఆమోదం లభించింది. కుల, ఆదాయ ధ్రువీకరణాల పత్రాల మంజూరులో సంస్కరణలకు కేబినెట్ ఆమోదం ఇచ్చింది. కోర్టుల్లో పనిచేసే సిబ్బంది, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఇకనుంచి డీఏ, డీఆర్ చెల్లింపు చేస్తారు. యాంటీ నక్సల్ ఆపరేషన్‌లో పనిచేసే టీమ్స్‌కు 15శాతం అలవెన్స్ పెంపు తూ నిర్ణయించారు. 51 రోజుల పాటు ఆడుదాం ఆంధ్రాలో 31 లక్షల మంది రిజిస్ట్రేసన్ జరిగింది.

## గడువుకన్నా ముందుగానే అసెంబ్లీ ఎన్నికలు



**షెడ్యూల్ కన్నా 20 ముందుకు వచ్చే ఛాన్స్**
**కేబినేట్ భేటీలో సిఎం జగన్ కీలక వ్యాఖ్యలు**

అమరావతి,డిసెంబర్15 : ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల గురించి సీఎం జగన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు నిర్దేశిత సమయం కంటే 15 నుంచి 20 రోజుల ముందుగానే జరుగుతాయని అన్నారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం జగన్ మంత్రులతో ఈ వ్యాఖ్యలు చేశారు. కాస్త ముందుగానే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని.. కాబట్టి, ఎన్నికలకు అందరూ పూర్తిగా రెడీగా ఉండాలని అన్నట్లు తెలిసింది. మన పార్టీ ఎన్నికలకు పూర్తి సన్నద్ధంగా ఉందని, అయినప్పటికీ మంత్రులు క్షేత్ర స్థాయిలో మరింత సమర్థంగా పని చేయాలని సీఎం నిర్దేశించారు. గతంలో కంటే 20 రోజుల ముందుగానే ఎన్నికల షెడ్యూల్ విడుదల కావొచ్చని సీఎం అన్నారు. ఈ మేరకు కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాస్త ముందుగానే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని.. అయినా ఎన్నికలకు పూర్తి సన్నద్ధంగా ఉన్నామని మంత్రులతో వ్యాఖ్యానించారు. అదే సమయంలో ప్రతిపక్ష పార్టీలు.. వాటికి కొమ్ము కాస్తున్న మీడియా సంస్థలు చేసే విష ప్రచారాలను తేలికగా తీసుకోవద్దని మంత్రులకు చెప్పినట్లు తెలుస్తోంది. ఈనాడు, యెల్లో మీడియాలో జరిగే ప్రచారాన్ని బలంగా తిప్పి కొట్టాలని మంత్రులకు సీఎం జగన్ సూచించారు. ఇకపోతే ఫిబ్రవరి నెలలో పార్లమెంట్ ఎన్నికలు జరగవచ్చునన్న ఊహాగానాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలు పార్లమెంట్ ఎన్నికలకు రెడీ అయిపోతున్నాయి. ఇప్పటికే ఏపీ సీఎం జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబు ఎన్నికలు ఫిబ్రవరి నెలలో ఉండవచ్చునని తమ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన నేతలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.


## 20న యువగళం విజయోత్సవ సభ

**పోలేపల్లిలో సభకు భారీగా ఏర్పాట్లు**
**ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసిన టిడిపి**

అమరావతి,డిసెంబర్15(: యువగళం విజయోత్సవ జైత్రయాత్ర సభకు టిడిపి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి 7 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు వెల్లడించింది. ఈ నెల 20న విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలోని పోలేపల్లిలో భారీ సభ ఏర్పాటు చేసేందుకు టిడిపి సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ప్రత్యేక రైళ్లు ఈ నెల 19న చిత్తూరు, తిరుపతి, రైల్వే కోడూరు, అనంతపురం, ఆదోని, నెల్లూరు, మాచర్ల నుంచి ప్రారంభమై తర్వాతి రోజు విజయనగరం చేరుకోనున్నాయి. ఒక్కో రైలులో 1300 మంది ప్రయాణించేలా ఏర్పాట్లు చేశారు. మరోవైపు అ÷-దదెకు బస్సులను సమకూర్చాల్సిందిగా ఆర్టీసీ అధికారులకు ఏపీ టిడిపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడు లేఖ రాశారు.జైత్రయాత్ర విజయోత్సవ సభకు టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ తోపాటు బాలకఅష్ణ ఈ సభకు హాజరుకానున్నారు. టిడిపి ? జనసేన పొత్తు ప్రకటన చేసిన తర్వాత ఒకే వేదికపైకి చంద్రబాబు, పవన్ రానుండటం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో రాష్ట్ర నలుమూలల నుంచి ఇరుపార్టీల శ్రేణులతో పాటు అభిమానులు భారీ ఎత్తున సభకు తరలివస్తారని అంచనా.

## టికెట్ల కేటాయింపుపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు

అమరావతి: టీడీపీతో సయోధ్యగా ఉన్న వారికే టికెట్లు కేటాయించడంలో ప్రాధాన్యత ఇస్తామని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తమ పార్టీ నేతలకు స్పష్టం చేశారు.గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు టికెట్ ఆశించేవారు వ్యక్తిగతంగా 10 వేల నుంచి 15 వేల ఓట్ల వరకు తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు.తాను జీరో బడ్జెట్ పాలిటిక్స్ చేస్తానన్నది వాస్తవం కాదని, ఎన్నికల కమిషనే రూ.40 లక్షలు ఖర్చు చేయవచ్చని



చెబుతుంటే.. తాను జీరో బడ్జెట్ పాలిటిక్స్ చేస్తానని ఎలా చెబుతానని ప్రశ్నించారు. '2019 ఎన్నికల్లో ఉదారతతో కొంత మందికి పార్టీ టికెట్ ఇచ్చాం. టీడీపీతో పొత్తుకు అభ్యంతరం తెలపని వారికి మాత్రమే టికెట్లు ఇస్తామని తెలిపారు.ప్రాంతీయ పార్టీలు.. కేంద్రంలో అధికారంలో ఉండే ఏదో ఒక జాతీయ పార్టీతో కలిసి ఉండక తప్పదని చెప్పారు. తాను బీజేపీతో కలిశానని తనను ముస్లింలు నమ్మడం లేదన్నారు.

## ఆ లేఖ రాయడానికి చంద్రబాబుకి తలకాయ ఉందా?: సజ్జల

అమరావతి: సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..31 లక్షల ఇంటి స్థలాలు ఇచ్చామని, నాడు-నేడు కింద స్కూళ్ల రూపు రేఖలు మార్చామన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు తమ హక్కుగా వినియోగించుకుంటున్నారని సజ్జల పేర్కొన్నారు."వైసీపీ ప్రభుత్వంలో కోటీ 47 లక్షల కుటుంబాలకు నేరుగా సంక్షేమం అందుతుంది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని ప్రజలు తమ హక్కుగా పొందుతున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఏం చేశారో ఒక్కటైనా చెప్పగలరా?. ఉద్ధానం కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. 2014-19 మధ్య సీఎంగా ఉన్న చంద్రబాబు ఉద్ధానానికి ఏం చేశాడు. ఉద్ధానం కోసం పవన్ కళ్యాణ్ ఏం చేశాడు. చంద్రబాబు ఎవరికి కథలు చెబుతాడు" అంటూ సజ్జల మండిపడ్డారు."తుఫాన్ల సమయంలో ఫలానా తక్షణ సాయం చేశానని చంద్రబాబు లెక్కలు చెప్పగలరా? తుఫాన్ విషయంలో 22 లక్షల్లో 10 వేల కోట్లు నష్టం వాటిల్లిందని కేంద్రానికి చంద్రబాబు లేఖ రాశాడు. ఈ లేఖ రాయడానికి చంద్రబాబుకి తలకాయ ఉందా?. ముఖ్యమంత్రి గా పనిచేసిన వ్యక్తి బాధ్యత లేకుండా మాట్లాడితే ఎలా?. తుపాను పరిహారం విషయంలో తప్పు పట్టడానికి అవకాశం లేకుండా చేశాం. అసలు చంద్రబాబుకి ఈ రాష్ట్రంతో సంబంధం ఏంటి. హైదరాబాద్ లో కూర్చుని రాష్ట్రానికి గెస్ట్ లా వస్తాడు. 2019లోనే చంద్రబాబును జనం రిజెక్ట్ చేశారు. ఈ రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకున్నాడు కాబట్టే చంద్రబాబును జనం చెత్త బుట్టలో వేశారు. హైదరాబాద్‌లో ఉంటే ఆస్తులు కాపాడుకోవచ్చని ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబు, లోకేష్,ఆయన దత్తపుత్రుడు కూడా రాష్ట్రానికి రావడం లేదు" అని సజ్జల ధ్వజమెత్తారు."చంద్రబాబును చూస్తుంటే సినిమాలో క్షుద్రపూజలు గుర్తొస్తున్నాయి. గతంలో దుర్గ గుడిలో పూజలు చేసినట్లు ఇప్పుడు కూడా పూజలేమైనా చేస్తున్నాడు అనుకుంటా. అభ్యర్థులు మార్పు విషయంలో అవాకులు చవాకులు పేలుతున్నారు.

## పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ దుర్మరణం

**రోడ్డుప్రమాదంలో మరణించినట్లు వెల్లడి**
**సిఎం జగన్, లోకేశ్ దిగ్భ్రాంతి**

భీమవరం,డిసెంబర్15: పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ దుర్మరణం చెందారు. ఉండి మండలం చెరుకువాడలో రెండు కార్లు ఢీకొన్న ఘటనలో సాబ్జీ మృతి చెందారు. సాబ్జీ కారు డ్రైవర్, గన్‌మెన్, పీఏకి తీవ్రగాయాలు కాగా, వారిని ఆసుపత్రికి తరలించారు. ఏలూరు నుంచి భీమవరం వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. మంత్రివర్గ సమావేశం జరుగుతుండగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మరణవార్త తెలుసుకున్న సీఎం జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సాబ్జీ మృతికి కేబినెట్ సంతాపం తెలిపింది. కేబినెట్ సభ్యులు 2



నిమిషాలు మౌనం పాటించారు. రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతిపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ మృతి చెందారని తెలిసి తీవ్ర విచారం వయక్తం చేశారు. శాసనమండలిలో వినిపించే ప్రజల గొంతు మూగబోయిందన్నారు.

# సంపాదకీయం

శనివారం 16-12-2023

## రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి

ఇటీవలి ఎన్నికల్లో కొన్నిరాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కొలవుదీరాయి. అందులో బిజెపి ప్రభుత్వాలు కూడా ఉన్నాయి. మధ్యప్రదేశ్,రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్‌లో బిజెపి ప్రభుత్వాలు కొలువుదీరాయి. తెలంగాలో కాంగ్రెస్ పార్టీ, కర్నాటకలోనే ఆరు నెలల క్రితమే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అలాగే మిజోరంలో మిజో పార్టీ అధికారం చేపట్టింది. ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఎవరివైనా కేంద్రం తనవంతు సాయం, మద్దతు కొనసాగించాల్సిందే. అభివృద్ధి కోసం ఈ రాష్ట్రాలను పట్టుకుని ముందుకు సాగాల్సిందే. అప్పేడ దేశం కూడా అభివృద్ధికి బాటలు వేస్తుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంగా ప్రధాని మోడీ అభినందనలు తెలుపుతూ కేంద్రం అన్ని విధాల అండగా ఉంటుందని మాటిచ్చారు. నిజానికి అన్ని రాష్ట్రాలకు కేంద్రం అండగా ఉండాలి. అక్కడి ప్రభుత్వాలు ఏ పార్టీవన్నది పక్కన పెట్టి ముందుకు సాగాలి. రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు.. ఈ రెంటిని అనుసంధానిస్తూ ముందుకు సాగాలి. నీతి ఆయోగ్ ఏర్పాటు సందర్భంగా ప్రధాని మోడీ కూడా కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కొత్త నిర్వచనం ఇచ్చారు. కానీ మోడీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. నిధుల కేటాయింపు మొదలు, అభివృద్ధి పనులు కూడా పరస్పర విశ్వాసంతో కొనసాగించాలి. రాష్ట్రాలు తప్పుదోవ పడుతున్న సందర్భంలో అవసరమైన హెచ్చరికలు కూడా చేయాలి. ఇదే సందర్భం లో తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా హెచ్చరికలు చేయడం మంచిదే. ఇకపోతే సిఎంలుగా ప్రతి ఒక్కరూ ప్రధానితో నిరంతరం సమీక్షించుకునే అవకాశాలు ఉండాలి. కనీసం ఒక్కో రాష్ట్రానికి ప్రధాని నెలలో ఒకరోజయినా సమయం కేటాయించి రాష్ట్రాల బాగోగులు, సమస్యలు చర్చించాలి. రాష్ట్రాల సమాహారమే దేశం అన్న విషయాన్ని మరవరాదు. రాష్ట్రాల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం పెద్దన్న పాత్ర పోషించాలి. విద్య,వైద్యం, ఆర్థిక రంగాల్లో నిరంతరంగా చేయూత ఇవ్వాల్సి ఉంటుంది. ధాన్యం సేకరణ, నదీజలాల కేటాయింపు సమస్యలు,విద్యుత్ సమస్యలు, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు వంటివి ఏవైనా కేంద్రం కూడా పెద్దతరహాలో రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే కేంద్ర రాష్ట్రాల మధ్య బంధం బలోపేతం అవుతుంది. పార్టీలు వేరయినంత మాత్రాన దేశం వేరు కాదన్న విషయం ఆయా రాష్ట్రాల సిఎంలు కూడా గమనించాలి. అలాగే కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న అధికారిక సంబంధాలు వేరు. సిఎంలుగా ఎవరైనా ఉండవచ్చు..ప్రధానిగా మరెవ రైనా ఉండవచ్చు.. కానీ వీరి రాజకీయాలకు రాష్ట్రాల అభివృద్ధి బలికావద్దు. రాష్ట్ర ముఖ్యమంత్రులు ఎవరైనా కావచ్చు పాలనాపర విషయాల కోసం కేంద్రంతో నిత్యం సంబంధాలు నెరపాల్సిందే. పార్టీలు ఏవైనా అధికారంలో ఉన్నది ఎవరైనా కేంద్రంతో నిరంతరాయంగా అనుసంధానం అవుతూనే ఉండాలి. ఏ ముఖ్యమంత్రి అయినాఢిల్లీ పర్యటనకు వెళ్లడం వంటివి రాజకీయ కోణంలో చూడరాదు. ఫెడరల్ వ్యవస్థలో సిఎంలు ప్రధానిని ,కేంద్ర మంత్రులను, కేంద్ర అధికారులను కలవడం సర్వసాధారణం. ఇది విమర్శించే రాజకీయ పార్టీలు గుర్తించాలి. తెలంగాణలో ఇప్పుడు కొత్తగా కాంగ్రెస్ ప్రబుత్వం ఏర్పడింది. సిఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఓ వారం రోజుల క్రితం కొత్త ప్రభుత్వం ఏర్పడింది. మర్యాద పూర్వకంగా సిఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి ఫోన్ చేసి మద్దతు కోరారు. రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఇందులో కొత్తేమీ లేదు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అనేకానేక సమస్యలు కేంద్రం వద్ద పెండింలో ఉన్నాయి. విభజన హామీలు అమలు కాలేదు. రోడ్ల విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదు. వీటిని ఆపడం వల్ల నష్టపోతున్నది ప్రజలే అని బిజెపి నేతలు గుర్తించాలి. కేంద్రంలో అధికారం లేకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు చొరవ తీసుకున్న కాంగ్రెస్ పార్టీ నిస్సహాయంగా నిలబడింది. ఇకపోతే పలు పెండింగ్ ప్రాజెక్టులు, జిఎస్టీ నిధుల విడుదలకు సంబంధించి కేంద్రంతో సమస్యలు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ కూడా పరిష్కరించుకోవడం సిఎంగా రేవంత్ రెడ్డి తక్షణ కర్తవ్యం. ఇవన్నీ చక్కబెట్టుకోవడం కోసం ఢిల్లీకి వెళ్లాల్సిందే. కేంద్ర రాష్ట్ర సంబంధాలు వేరు..రాజకీయ పోరాటాలు వేరని గుర్తించాలి. రాష్ట్రాలకు సంబంధించి అనేక సమస్యలను ఎప్పుడూ నిలదీయడంలోనూ వెనకడుగు వేయరాదు. గత పదేళ్లుగా తెలంగాణ విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముఖ్యంగా మోడీ ఎందుకనో నిర్లక్ష్యంగా ఉన్నారు. అనేకానేక సమస్యలను పట్టించు కోవడం లేదు. అందువల్ల రాజకీయ విభేదాలను కట్టిపెట్టాలి. అభివృద్ధికి సంబంధించి రాష్ట్రాలతో కలసి చర్చించాలి. అప్పుడే పటిష్టమైన దేశంగా అభివృద్ధి సాధించగలదు.

## ఉమ్మడి వరంగల్ జిల్లా బిఆర్ఎస్‌లో మంటలు

మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్‌లే విలన్లు
మండిపడ్డ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి
వారి వల్లనే పార్టీ భ్రష్టు పట్టిందని వ్యాఖ్య
తన ఓటిమికి కారకులను వదిలేది లేదన్న శంకర్ నాయక్

వరంగల్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): ఉమ్మడి వరంగల్ జిల్లాలో బిఆర్ఎస్ అంతర్గ విద్వేషాలు భగ్గుమన్నాయి. తనను సొంతపార్టీ నేతలే కొందరు పనిగట్టుకుని ఓడించారని మహబూబాబాద్ మాజీ ఎమ్ఎల్యే శంకర్ నాయక్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇకపోతే మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్‌లకారణంగా జిల్లాలో బిఆర్ఎస్ భ్రష్టు పట్టిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్ రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీంతో ఇప్పుడు ఈ వ్యవహారం జిల్లాలో కలకలం రేపుతోంది. శుక్రవారం తక్కళ్లపల్లి మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్ ఆత్మగౌరవం ఉన్న జిల్లా అని అన్నారు. ఎర్రబెల్లి, సత్యవతికి మంత్రి పదవులు ఇస్తే ఉద్యమకారులు బాధ పడ్డారని తెలిపారు. తెలంగాణ వాదం, ఉద్యమం తెలియని వారికి మంత్రి పదవి ఇస్తే ఎట్లా అని ప్రశ్నించారు. అధినేత వాస్తవాలు వినే అవకాశం ఇస్తే ఎవరైనా వాస్తవాలు చెబుతారన్నారు. వాస్తవాలు చెప్పే వారు బయట, జోకుడు గాల్లు లోపల ఉంటే ఎలా వాస్తవాలు తెలుస్తాయని నిలదీశారు. ఖమ్మంలో ప్రతిసారి బయట గెలిచిన వారిని పార్టీలోకి తెచ్చుకుంటే నేతలు గ్రూపులుగా విడిపోయారన్నారు. ఎర్రబెల్లిని మంచి లీడర్ అంటే ప్రజలు ఉరికించి కొడతారని వ్యాఖ్యానిం చారు. ఆయన వల్లనే జిల్లాలో పార్టీకి ఆదరణ లేకుండా పోయిందని అన్నారు. ఎర్రబెల్లి చక్కిలి గింతలు పెట్టడం తప్ప ఎవ్వరికీ రూపాయి సహాయం చేయరని విమర్శించారు. కొన్ని జిల్లాల్లో తమ ఎమ్మెల్యేలు ప్రజలకు ఇరిటేషన్ పెంచారన్నారు. దానిని ఎలా మేనేజ్ చేయాలో పార్టీకి ప్లాన్ లేకపోతే ఎలా గెలుస్తామని అడిగారు. ఇకపోతే వరంగల్ జిల్లాలో మాజీ ఎమ్మెల్యేలకు సెక్యూరిటీ అవసరం లేదని... కుక్కలు కూడా వారి వెంట పడవంటూ తక్కలపల్లి రవీందర్ వ్యాఖ్యలు చేశారు. ఇకపోతే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో ఉండి ఎవ్వడు ఏ మోసం చేసిండో చూపిస్తా.. నాకు ఆల్రెడీ 55 సంవత్సరాలు క్రాస్ అయ్యాయి ఇంకా నన్ను ఏం చేస్తార్రబై.. ఒక్కొక్కడిని ఆట ఆడుకుంటా వేట మొదలైంది. కేసీఆర్ హాస్పిటల్‌లో ఉండి బుక్స్ చదువుతున్నాడు, భవిష్యత్తు ఎలా చెయ్యాలని... నేను, కేసీఆర్ ఒక్క కార్తెలోనే పుట్టాం బిడ్డ. కార్యకర్తలను కాపాడుకునే సత్తా నాకు పుష్కలంగా ఉంది. రాత్రి 12 గంటలకు ఆపద వచ్చిన ఫోన్ చేయండి వస్తా. నీకు ధైర్యం ఉంటే నా కార్యకర్తను ముట్టుకో, తర్వాత ఏమైతదో చూసుకో. ఇన్నిరోజులు ఎమ్మెల్యే పదవి ఉంది కాబట్టే అలోచించాను, ఇప్పుడు మనల్ని ఆపేటోడు లేడు. ఒక్క అయ్య అవ్వకు పుట్టి ఉంటే, నేను చేసిన తప్పులను నిరూపించాలని నాపై ఆరోపణలు చేసిన వారికీ సవాల్ చేసిన కానీ ఎవ్వడు రాలే. మనం ఎవ్వరి జోలికి పోవొద్దు, మన జోలికి వస్తే వదిలిపెట్టొద్దు. కార్యకర్తకు ఆపద వస్తే మెరుపు వేగంతో వస్తా... మీకు అండగా నిలబడుతా' అంటూ శంకర్ నాయక్ కామెంట్స్ చేశారు. అయ్యప్ప మాలధారణలో ఉండి మరీ శంకర్ నాయక్ ఈ మేరకు వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే శంకర్‌నాయక్ ఈ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

## అయ్యప్ప స్వాములకు భిక్ష పెట్టడమంటే మహా భాగ్యం

లింగాల వెంకట్ స్వామి





మణుగూరు డిసెంబర్ 15 విజయ తెలంగాణ: హరిహర సుతుడు, విల్లాలి వీరుడు, వీరమణికంతుడు, అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన అయ్యప్పస్వామి దీక్ష పరులకు సేవ చేయడం ఎంతో సంతోషాన్ని కలుగజేస్తుందని లింగాల వెంకట్ స్వామి అన్నారు. శుక్రవారం శ్రీ శ్రీ శ్రీ కాళీమాత ఆలయం లో ఉప్పల సత్యనారాయణ శాస్త్రి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు, దీక్షపరులకు వెంకట్ స్వామి తనయ పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురు స్వామి మాట్లాడుతూ కాళికామాత ఆలయంలో ప్రతి సంవత్సరం కార్తీక శుద్ధ పాడ్యమి నుండి మార్గశిర శుశ్రీశ్రీ త్రయోదశి వరకు జరుగు అన్న ప్రసాద కార్యక్రమంలో భాగంగా దీక్ష పరులకు భిక్ష పెట్టేందుకు నాది ఒక్కరోజు అంటూ ముందుకు వచ్చి అన్నదానం నిర్వహించినందుకు అయ్యప్ప స్వామి కరుణ కటాక్షంతో అష్ట ఐశ్వర్యాలు కలగాలని ఆశీర్వదించారు. అనంతరం వెంకట్ స్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కాళీమాత ఆలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తుండగా అందులో భాగంగా నాది ఒకరోజుగా భావించి డిసెంబర్ 15న అన్నదానం చేస్తున్నానని, అదేవిధంగా ఈ సారి కూడా అన్నదానం చేశానని పేర్కొన్నారు. అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తే మనస్సుకు వచ్చే ప్రశాంతత అభివర్ణించలేమన్నారు.

## మొన్నటి ఎన్నికలు ప్రజాస్వామ్య బద్దంగా జరగలే

ఎన్నికల్లో ఫలితాలు బిజెపిని నిరాశపరిచాయి
గజ్వేల్ కార్యకర్తల భేటీలో ఈటెల రాజేందర్

సిద్ధిపేట,డిసెంబర్15: తెలంగాణలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగివుంటే ఫలితాలు మరోలా ఉండేవని బీజేపీ నేత, మాజీ మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. మొన్నటి ఎన్నికలు ప్రజాస్వామ్య బద్దంగా జరగలేదన్నారు. అలా జరిగే ఉంటే ప్రజలు, ధర్మం, న్యాయం గెలిచేవన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో బీజేపీ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో బీజేపీకి 14 వందల పైగా ఓట్లు వస్తే ఇప్పుడు ప్రతీ గ్రామంలో కమలం పార్టీకి పెద్ద ఎత్తున కార్యకర్తలు తయారయ్యారని ఈటల అన్నారు. అలాంటపపుడు ఓట్లు పెరగాల్సి ఉందిన్నారు. కానీ అలా జరగేలదన్నారు. ఎన్నికల తీరు, ఫలితాలు బిజెపికి నిరాశ కలిగించిన మాట వాస్తవమన్నారు. ఇప్పుడు జరిగిన ఎన్నికలు రాష్ట్ర ఎన్నికలని, రేపు జరగబోయే ఎన్నికలు నరేంద్ర మోడీకి సంబంధించిన ఎన్నికలన్నారు. ఈ ఎన్నికల్లో 8 స్థానాలు గెలుచుకొని రెండు పార్టీలకు బీజేపీ ముచ్చెమటలు పుట్టిస్తోందన్నారు. స్కీములైనా తాను చేస్తున్నామని, తాము ఇస్తున్నామని ఏ నాడూ ప్రధాని మోదీ అనలేదని ఈటల పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తుందని మాత్రమే అంటారని పేర్కొన్నారు. కానీ తెలంగాణలో మాత్రం ఏ స్కీములైనా కేసీఆర్ తానిస్తున్నానని అంటారన్నారు. కేసీఆర్ ఏమైనా ఆయన ఇంట్లో నుంచి ఇస్తున్నాడా.. నీయబ్బ జాగీరా అని మేము ఎన్నోసార్లు ప్రశ్నించాం.

## దవదిశ లేకుండా గవర్నర్ ప్రసంగం




ఆరు గ్యారెంటీలకు కానరాని ప్రణాళిక
రూట్ మ్యాప్ లేకుండా కాంగ్రెస్ తీరు
ఇప్పుడే తెలంగాణ విముక్తి అన్నట్లు చెప్పడం దారుణం
గవర్నర్ ప్రసంగం అంతా అబద్దాలమయం
బిఆర్ఎస్ నేత కడియం శ్రీహరి పెదవివిరుపు

హైదరాబాద్,డిసెంబర్15 : తెలంగాణ సాధించిన ప్రగతిని పక్కన పెట్టి గవర్నర్ ప్రసంగం చేశారని అందులో కొత్తదనం లేదని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలకు ఎటువంటి ప్రణాళిక గవర్నర్ ప్రసంగంలో లేదన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన రూట్ మ్యాప్ గవర్నర్ ప్రసంగంలో లేదు. అది ఉంటే బాగుండేదని, కానీ గవర్నర్ చేత ఈ రాష్ట్ర ప్రభుత్వం అన్ని అసత్యాలను చెప్పించిందని మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగం ముగిసిన అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో కడియం శ్రీహరి మాట్లాడారు. తోటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి ఎంచుకున్న మార్గం ఏమిటో చెప్పలేదన్నారు. అబద్దాలను చెప్పించడం తగదన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం అభివృద్ధికి ఎంచుకున్న మార్గమేమిటో, పంథా ఏమిటో అన్నది గవర్నర్ ప్రసంగంలో కానరాలేదన్నారు. గవర్నర్ ప్రసంగం అంతా కాంగ్రెస్ మేనిఫెస్టో చదివినట్టుగా ఉందన్నారు. పదేళ్లలో తెలంగాణ సాధించిన అభివృద్ధిని విస్మరించారని, తిరోగమన దిశలో తెలంగాణ ఉన్నట్టు చెప్పే ప్రయత్నం చేశారని కడియం అన్నారు. నీతి ఆయోగ్ ప్రశంసలు, కేంద్ర ప్రభుత్వ అవార్డులను విస్మరించారని, ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్, ఐటీ ఎగుమతుల్లో సాధించిన ప్రగతిని గవర్నర్ చెప్పడం మరచిపోయారని ఆయన అన్నారు. నిరంతర విద్యుత్‌ను ఎవరూ కాదనలేరని అన్నారు. తెలంగాణ నిర్బంధం నుంచి విముక్తి అయింది అని గవర్నర్ చెప్పడం సరికాదన్నారు. ఆమె స్థాయికి తగదన్నారు. గవర్నర్ అబద్దాలు చెప్పడం దురదృష్ట కరమని కడియం అన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించుకున్నారని, 2014 లోనే తెలంగాణ నిర్బంధం నుంచి విముక్తం అయ్యిందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఎలా అమలు చేస్తారో చెప్పలేదని, దళిత బంధు ప్రస్తావన లేదని, రైతుల పంటలకు బోనస్ గురించి మాట్లాడ లేదన్నారు. కాంగ్రెస్ హామీల నుంచి పలాయన వాదం పాటించేలా గవర్నర్ ప్రసంగం ఉందని ఆయన అన్నారు. గవర్నర్ గతంలో మాట్లాడింది, ఇప్పుడు మాట్లాడింది సమీక్ష చేసుకోవాలని కడియం సూచించారు. గవర్నర్ ప్రసంగం పూర్తిగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో చదివినట్లు ఉంది. గత పది సంవత్సరాలుగా తెలంగాణ తిరోగమనంలో ఉన్నట్లు గవర్నర్ ప్రసంగం ఉంది. కానీ జాతీయ స్థాయిలో అనేక తెలంగాణ అవార్డులు అందుకున్నది గవర్నర్ మరిచిపోయారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను తలదన్ని తెలంగాణ వరి ఉత్పత్తిలో ముందు నిలిచింది. తలసరి ఆదాయం గణనీయంగా పెరిగింది నిజం కాదా? ఐటీ ఉత్పత్తులు, ఎగుమతుల్లో హైదరాబాద్ బ్రహ్మాండమైన అభివృద్ధి సాధించింది అని శ్రీహరి తెలిపారు. ప్రజలందరూ ఇప్పుడు సంతోషపడుతున్నట్లు మాట్లాడడం సరైంది కాదు. పది సంవత్సరాల కాలంలో తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ వాయువులు పీల్చారు. కానీ ఇప్పుడు తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ వాయువులు పిలుస్తున్నారని చెప్పడం సముచితం కాదు. తెలంగాణ నిర్బంధం నుంచి విముక్తి అయిందని గవర్నర్ చెప్పడం సరికాదు. గవర్నర్ అబద్దాలు చెప్పడం దురదృష్టకరం. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించు కున్నారు. 2014లోనే తెలంగాణ నిర్బంధం నుంచి విముక్తి అయింది. ఇప్పుడు కావడవేమిటి అని కడియం ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగంలో దళిత బంధు ప్రస్తావన లేదు. మద్దతు ధరకు రూ. 500 కలిపి ధాన్యం కొనుగోలు చేస్తామని అన్నారు. దానిపై గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావన లేదు. దీన్ని బట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా కనబడడం లేదు. ప్రభుత్వం విడుదల చేసే శ్వేత పత్రాలపై మా నుండి కూడా సరైన సమాధానం ఉంటుంది

## పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం

సీజనల్ వ్యాధుల నివారణకు ఇదే మార్గం

విజయవాడ,డిసెంబర్15: ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతలకు అలవాటు పడలేక పోతున్నారు. ఇది కొనసాగితే విషజ్వరాలు లేదా, అంటువ్యాధులు ప్రబలవని వైద్యనిపుణులు అంటున్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్తాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి. ప్రతి ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాంల వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. పలు పట్టణాల్లో మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ఏలూరులో వింతవ్యాధి ఇటీవల ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలుతున్న విషయం సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజలు పురపాలకసంస్థపై ధ్వజమెత్తుతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యం తోనే సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుద్ధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి.ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్ధ్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది.

# రైల్వే జోన్ ఫైట్...

విశాఖపట్టణం, డిసెంబర్ 15,ఆంధ్రప్రదేశ్ లో మళ్లీ ఎన్నికల హడావుడి కనిపిస్తోంది. మళ్లీ ఎన్నికలు అంశాలు తెరపైకి వస్తున్నాయి. వాటిలో ఒకటి విశాఖ రైల్వే జోన్. ఉత్తరాంధ్ర వాసుల సెంటిమెంట్ అయిన విశాఖ రైల్వే జోన్ ను ఏర్పా?టు చేస్తున్నట్లుగా 2019 ఎన్నికలకు ముందు కేంద్రం ప్రకటించింది. కేబినెట్ సమావేశంలో తీర్మానం చేశారు. ఐదేళ్లు గడిచినా ఇప్పటి వరకూ కనీసం ఒక్క అడుగు ముందుకు పడలేదు. రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇవ్వలేదని కేంద్రం అంటోంది. కానీ భూమి అవసరం లేదని రాష్ట్రం వాదిస్తోంది. ఈ పీటముడి పడిపోవడం.. రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా అడగకపోవడంతో రైల్వేజోన్ అంశం ఇప్పటికీ సాకారం కాలేదు. ఎపి విభజన చట్టం సెక్షన్ 93 షెడ్యూల్(8) ప్రకారం రైల్వే జోన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఎనిమిదేళ్లయినా పరిస్థితి ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటుచేయమని ప్రజలు అడిగితే....ఏటా రూ.8200 కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న రైల్వే డివిజన్‌ను ఎత్తివేస్తామని ప్రకటించింది. అదే సమయంలో జోన్ ఏర్పాటుకు విశాఖలో అన్ని వసతులూ ఉన్నా మీనమేషాలు లెక్కిస్తోంది. డివిజన్‌ను కొనసాగిస్తూ జోన్ ఏర్పాటు చేయాలన్నది ప్రజల ఆకాంక్ష. రాజకీయ లబ్ధి కోసం బీహార్‌లో ఆఘమేఘాల మీద జోన్ ఏర్పాటు చేసిన కేంద్రం.... ఇక్కడ ఎనిమిదేళ్లయినా వినిపించుకోవట్లేదు. అన్ని పరిశీలనలు పూర్తి చేసి ఐదేళ్ల కిందట ప్రకటన చేసినా అది పేపర్లలోనే ఉంది. రైల్వే బోర్డు డీపీఆర్ ఎప్పుడో రెడీ అయింది. తొలి డిపిఆర్‌లో రూ.300కోట్ల వరకూ ప్రతిపాదన పెట్టగా కేంద్ర రైల్వే శాఖ రూ.176 కోట్లకు సవరించి పంపించింది. ఉద్యోగులు, సిబ్బంది మార్పులు, చేర్పులకు సంబంధించిన వివరాలను కేంద్ర రైల్వే బోర్డు కోరగా పంపించారు. అంటే డిపిఆర్‌ను పరిశీ లించడమే కాదు.. ఆమోదించడమూ జరిగింది... సవరణలు కూడా చేశారు.. డిపిఆర్‌ను పరిశీలిస్తున్నామంటూ పార్లమెంట్ లో రైల్వే శాఖా మంత్రి ప్రకటించారు కూడా. తాజాగా రైల్వే జోన్ ఇవ్వడం సాధ్యం కాదు అంటూ రైల్వే శాఖ అధికారుల ప్రకటన తర్వాత 'వదంతులు నమ్మొద్దు అంటూ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం సాయంత్రం ఢిల్లీలో ప్రకటించారు. సౌత్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయాన్ని తక్షణమే నిర్మించేందుకు భూమి, నిధులు అందు బాటులో ఉన్నాయని చెబుతున్నారు. రైల్వే డిఆర్ఎం కార్యాలయం పక్కనే నూతన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కోసం 2017లోనే రైల్వే అధికారులు స్థలాన్ని సిద్ధం చేసి, డిపిఆర్‌లో పొందుపరిచారు. కానీ కేంద్రంలోని బిజెపి రాజకీయ జాప్యం చేస్తూనే ఉంది. విశాఖను రైల్వే డివిజన్‌గా కేంద్రం.. అత్యంత లాభదాయకమైన వాల్తేర్ డివిజన్‌ను మాత్రం రెండు ముక్కలు చేసింది. ఒక ముక్కను విజయవాడ డివిజన్‌లో కలిపారు. మరో ముక్కతో ఒడిసాలోని రాయగఢ కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంటే? విశాఖ కేంద్రంగా జోన్ ఉంటుందికానీ, డివిజన్ ఉండదు. సరుకు రవాణాలో కీలకమైన కోరాపుట్, కిరండోల్ లైన్లను రాయగఢలోనే కలిపేశారు. శ్రీకాకుళం జిల్లాలో పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ ఉన్న రైల్వే స్టేషన్లు ఖుర్దా డివిజన్‌లో ఉన్నాయి. వీటిని కూడా.. విశాఖ రైల్వేజోన్‌లో చేర్చలేదు. రైల్వే జోన్ ఇంకా పేపర్ల మీదకు కూడా పూర్తి స్థాయిలో రాలేదు. కానీ రాయగడ డివిజన్ పనులు మాత్రం పూర్తయ్యాయి. రాయగడ డివిజన్ ఏర్పాటుకు మౌలిక వసతులేమీ లేవు. అయినా అటు రైల్వేబోర్డు, ఇటు తూర్పుకోస్తా రైల్వేజోన్ రాయగడలో ఏర్పాట్ల మీద కోట్లు ఖర్చు చేసింది. . రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాల పెంపు, ఇతర భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రాయగడలో ఏర్పాట్ల కోసం నోడల్ అధికారిని నియమించారు. డివిజన్‌లో రైల్వే ఆస్తుల రక్షణ బాధ్యతల్ని చూసే ఆర్‌పీఎఫ్ వ్యవస్థ ఏర్పాటు కోసం రాయగడలో నిర్మాణాలు జరుగుతున్నాయి. డివిజన్ స్థాయి అధికారుల కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు మాత్రం ఎక్కడిదక్కడే ఉంది.ఎపి విభజన హామీల్లో అత్యంత కీలకమైన ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, విశాఖకు నూతన రైల్వే జోన్ వంటి అన్నింటినీ తుంగలో తొక్కుతూ హామీలకు తూట్లు పొడుస్తోంది బిజెపి. ఎపికి ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు పునర్విభజన చట్టం సెక్షన్ 93, షెడ్యూల్ (3)లో పేర్కొన్నా, 2016 సంవత్సరం నుంచీ నాన్చుతూనే ఉంది. 2019లో ఎన్నికలకు ముందు విశాఖ నగరంలో బిజెపి ర్యాలీ, సభకు విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ త్వరలోనే దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖలో ప్రారంభిస్తానని ప్రకటించి ఈ ప్రాంత ప్రజలు, రైల్వే ఉన్నతాధికారులు, ఉద్యోగుల్లో ఆశలు రేపాయి. కానీ, కేంద్ర సర్కారు నయవంచన ఎంతకాలం? అంటూ తాజాగా వీరు ప్రశ్నిస్తున్నారు. రైల్వే డిఆర్ఎం కార్యాలయంలో 15 ఎకరాల స్థలం భవనాల కోసం సిద్ధంగా ఉన్నా భూమి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదంటూ రైల్వే మంత్రి, రాజ్యసభ సభ్యులు జివిఎల్ వంటి వారు ప్రచారం చేస్తున్నారని వైసీప నేతలు విమర్శిస్తున్నారు. వాస్తవానికి గతంలో రైల్వే భూమి బస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టం (బిఆర్‌టిఎస్) కోసం 2015లో 52.2 ఎకరాలను ముడసర్లోవలో రైల్వేకు రాష్ట్ర ప్రభుత్వం చూపించింది. దీంట్లో పది ఎకరాలు మాత్రమే వివాదంలో ఉంది. వివాద రహిత భూమిలో జోన్ పనులకు ఆటంకం ఏమిటి? అంటూ రైల్వే ఇంజనీరింగ్ అధికారులు వాపోతున్నారు.ప్రస్తుతానికి , కేంద్రం రాష్ట్రం ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు కానీ.. రైల్వేజోన్ మాత్రం సాకారం కావడం లేదు.

## ఏపీ కాంగ్రెస్ దూకుడు



విజయవాడ, డిసెంబర్ 15, తెలంగాణ విజయంతో ఊపు మీదున్న కాంగ్రెస్.. పక్కా ప్లాన్‌తో వస్తాం.. ఏపీలో కూడా గట్టిగా కొడతాం అంటోంది. ఇన్నాళ్లూ నిస్తేజంగా, నీరసంగా ఉన్న కాంగ్రెస్, వై నాట్ ఏపీ అంటోంది. ఏపీ ఎన్నికలకు యాక్షన్ ప్లాన్‌తో రెడీ అంటోంది. విజయవాడలో జరుగుతున్న పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశాల్లో పార్టీని ఏపీలో సంస్థాగతంగా ఎలా బలోపేతం చేయాలో చర్చించారు కాంగ్రెస్ నేతలు. ఈ నెల 21న ఏపీ కాంగ్రెస్ వ్యవహారాలపై ఢిల్లీలో స్ట్రాటజీ మీటింగ్ జరుగుతుందన్నారు గిడుగు. మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో ఏపీలో ఎలా ముందుకు వెళ్లాలనేదానిపై యాక్షన్ ప్లాన్ సిద్ధమవుతుందని ఏపీ కాంగ్రెస్ చీఫ్ గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. ఏపీలో పొలిటికల్ వాక్యూమ్ ఉందంటుని గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. చంద్రబాబు, జగన్ పాలనను ప్రజలు చూశారని, విభజన హామీల కోసం ఆ పార్టీలు పనిచేయలేదని ప్రజలు గుర్తించారని, ఈసారి తమకు పట్టం కడతారంటున్నారు ఆయన.

## హస్తినకు చేరిన ఓట్ల పంచాయితీలు...

విజయవాడ, డిసెంబర్ 15, బోగస్ ఓటర్ల అంశం మరోసారి రాజకీయాలను వేడెక్కించింది. లక్షల్లో దొంగ ఓట్లు నమోదయ్యాయంటూ ఆంధ్రప్రదేశ్ అధికారపార్టీ వైసీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. ఏపీలో టీడీపీ దొంగ ఓటర్లను చేర్పించడంపై విజయసాయిరెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఢిల్లీలో గురువారం సెంట్రల్ ఎలక్షన్ కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఏపీలో టీడీపీ నేతలు 40లక్షల 76 వేల 580 ఓట్లను ఒకే ఫొటోతో ఇంటి పేరు మార్చి పలు ప్రాంతాల్లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్లుగా టీడీపీ సానుభూతిపరుల పేరు నమోదు చేశారని ఎంపీలు సీఈసీకి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్, కర్ణాటక, తమిళనాడు, ఒడిషాల్లో నివసిస్తున్న టీడీపీ సానుభూతిపరుల ఓట్లు ఏపీలో టీడీపీ నేతలు నమోదు చేయించారని తెలిపారు. ఈ దొంగ ఓటర్ల వ్యవహారంపై విచారణ చేసి దొంగ ఓటర్లను తొలగిస్తున్న బూత్‌లెవల్ అధికారులపై టీడీపి నేతలు దాడులు చేస్తున్నారని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓటర్లను తొలగించేందుకు ఫారం-7 దరఖాస్తులను బీఎల్‌ఓలకు టీడీపీ నేతలు సమర్పిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు సీఈసీని కోరారు.కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు అనంతరం వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సహా ఉన్నతాధికారులను కలిసినట్లు తెలిపారు. టీడీపీ ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘిస్తూ "మై పార్టీ డాష్ బోర్డ్" యాప్ ద్వారా ప్రజల కుల, మత, వ్యక్తిగత వివరాలు సేకరిస్తోందన్నారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధం అనే విషయాన్ని ఈసీ అధికారుల దృష్టికి తీసుకొచ్చామన్నారు. ఈ డాటాను అమెరికాలోని న్యూయార్క్ నగరంలోని సర్వర్ లో భద్రపరుస్తున్నారన్నారు. సేవా మిత్ర పేరుతో గతంలో ఇలాగే డేటా సేకరించారని.. వారిపై కేసులు కూడా నమోదు చేశామని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఒక వ్యక్తి కులాన్ని తెలుసుకోవడం ద్వారా పోలరైజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మోడల్ కోడ్ ఉల్లంఘించేలా అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని తెలిపారుఓటర్ వెరిఫికేషన్ పేరుతో ప్రతి 30 ఇళ్లకు ఒక టీడీపీ కార్యకర్తను నియమిస్తున్నారంటూ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఆ కార్యకర్త మానిఫెస్టో రూపొందించే కసరత్తు ఆ 30 కుటుంబాలకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించి లండన్ సర్వర్ లో భద్రపరుస్తున్నారన్నారు. ప్రభుత్వ అధికారిగా లేక ఎన్నికల కమిషన్ అధికారిగా ప్రజలను మభ్యపెడుతూ వివరాలు సేకరిస్తున్నారని పేర్కొన్నారు. ఇలా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి తమ ఓటర్లు కాదు అనుకుంటే వారి ఓట్లు తొలగించేలా తప్పుడు దరఖాస్తులు చేస్తున్నారన్నారు.

## స్వరం మారుస్తున్న కమలం

రాజమండ్రి, డిసెంబర్ 15, ఏపీ విషయంలో బిజెపి స్వరం మారుతుందా? ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి ఎదురైందా? ఒంటరిగా పోటీ చేస్తే దారుణ ఫలితాలు వచ్చే అవకాశం ఉందా? అందుకే సీట్లు, ఓట్లు పెంచుకునేందుకు ఆ పార్టీ సిద్ధపడుతుందా? టిడిపి, జనసేన కూటమిలో చేరేందుకు దాదాపు నిర్ణయించుకుందా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఈ అనుమానాలు పెరుగుతున్నాయి. వైసీపీతో మునుపటి సత్యతతో బిజెపి అగ్రనేతలు వ్యవహరించకపోవడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుతోంది. ముఖ్యంగా సీఎం జగన్ ఢిల్లీ టూర్లు తగ్గిపోవడంతో రకరకాల చర్చలు జరుగుతున్నాయి.వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ కేంద్ర పెద్దలతో సఖ్యతగా వ్యవహరించేవారు. సంక్షేమ పథకాలు అమలుకు పెద్ద ఎత్తున నగదు అవసరం. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ అప్పులు అమాంతం పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం విధించిన పరిమితికి మించి చేరుకున్నాయి. దీంతో ప్రతినెలా ఢిల్లీకి వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఇతర అధికారుల బృందం ప్రతినెలా చివరి వారంలో ఢిల్లీలో పడిగాపులు కాస్తుంటుంది. అదే సమయంలో సీఎం జగన్ అక్కడ ప్రత్యక్షమవుతారు. రుణాలు ఇట్టే మంజూరవుతాయి. అయితే గత రెండు నెలలుగా ఢిల్లీ టూర్లు జగన్ నిలిపివేయడంతో రకరకాలైన చర్చ నడుస్తోంది.ఏపీ సీఎం జగన్ కాంగ్రెస్ కు దగ్గరైనట్లు జాతీయస్థాయిలో ఒక ప్రచారం ఉంది. ఆ మధ్యన యూరప్ పర్యటనలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని జగన్ కలిశారని ఒక వార్త హల్ చల్ చేసింది.ఇటీవల షర్మిల విషయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తో జగన్ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఇదంతా కాంగ్రెస్ పార్టీ వైపు తాను చూస్తున్నట్లు సంకేతాలు ఇవ్వడానికేనని ప్రచారం జరుగుతోంది. తెలంగాణలో షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరితే తనకు ఇబ్బందికర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని జగన్ భావించినట్లు తెలుస్తోంది. రాహుల్ గాంధీ ద్వారా షర్మిల ఎంట్రీ ని అడ్డుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం కు జగన్ లో ఒక రకమైన మార్పు వచ్చినట్లు తెలుస్తోంది.అయితే ఈ విషయాలన్నింటి పైన సమాచారం ఉన్న బిజెపి జగన్ ను దూరం పెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు గానీ జగన్ కు చెక్ చెప్పకుంటే భవిష్యత్తులో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయని బిజెపి భావిస్తున్నట్లు సమాచారం. అందుకే తెలుగుదేశం పార్టీకి స్నేహ హస్తం అందించాలని.. ఏపీలో ఓట్లు సీట్లు పెంచుకోవాలని భావిస్తున్నట్లు బిజెపి నేతలు కొందరు చెబుతున్నారు. ఇదే నిజమైతే ఏపీలో వైసీపీకి గడ్డు రోజులు వచ్చినట్టే. గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సైతం ఇదే తరహా తప్పును చేసింది. అందుకు తగ్గ మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు ఆ వంతు వైసీపీకి వచ్చింది. మరోవైపు ఎన్నికల సమీపిస్తుండటంతో.. ఒంటరిగా పోటీకి వెళ్లాలా? టిడిపి, జనసేన తో కలిసి పోటీ చేయాలా? అని తేల్చాల్సిన అనివార్య పరిస్థితి కూడా ఎదురైంది. దీంతో కూటమి వైపు బిజెపి మొగ్గు చూపే అవకాశం ఉంది.




## సర్వేల మాయలో వైసీపీ...

నెల్లూరు, డిసెంబర్ 15, ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్నాయి. జాతీయ మీడియా సంస్థలు సర్వేలను వెల్లడిస్తున్నాయి. దాదాపు మెజారిటీ సర్వే సంస్థలు మళ్లీ వైసీపీతో గెలుపు అని తేల్చి చెబుతున్నాయి. అయితే ఈ సర్వేలపై సొంత పార్టీ శ్రేణుల్లోనే అనుమానాలు ఉన్నాయి. వైసిపికి ఏకపక్ష విజయం దక్కుతుంది అన్నది సర్వేల సారాంశం. కానీ క్షేత్రస్థాయిలో చూస్తే పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. తీవ్ర ప్రజా వ్యతిరేకత నడుమ ఆ స్థాయిలో ఫలితాలు సాధ్యమా? అని సొంత సొంత పార్టీ శ్రేణులే అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. నాయకత్వం మాత్రం సర్వేల భ్రమల్లో ఉంది. దీంతో తెలంగాణలో బిఆర్ఎస్ బాటలో ఏపీలో వైసిపి కొనసాగుతుండడంపై రకరకాల చర్చ నడుస్తోంది.తాజాగా టైమ్స్ నౌ సంస్థ ఏపీలో సర్వే ఫలితాలను వెల్లడించింది. రెండు నెలలు కిందట వైసీపీకి ఇచ్చిన ఏకపక్ష ఫలితాలనే మళ్లీ ప్రకటించింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైసీపీకి 24 నుంచి 25 లోక్సభ స్థానాలు వస్తాయని తేల్చి చెప్పింది. తెలుగుదేశం పార్టీ ఒక్క స్థానం గెలుపొందవచ్చు.. లేకపోవచ్చు అని తెలపడం విశేషం. అయితే సదరు మీడియా సంస్థతో వైసీపీ ప్రభుత్వానికి మంచి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏపీ ప్రభుత్వ ప్రచార బాధ్యతను సదరు మీడియా సంస్థ చూస్తోందని? అందుకే వైసిపికి సానుకూల ఫలితాలు ఇస్తోందని టిడిపి, జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమస్త తెలంగాణలో బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని గణాంకాలతో సహా వెల్లడించడం విశేషం.ప్రస్తుతం ఏపీలో విరుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. కనీసం గత ఎన్నికల్లో జగన్ కు ఉన్న అనుకూల వాతావరణం ఏదీ ఇక్కడ కనిపించడం లేదు. కుల సమీకరణలు, చంద్రబాబు అరెస్టు తరువాత మారిన పరిస్థితులు, తెలంగాణ ఎన్నికల ప్రభావం, పవన్, లోకేష్ ల యాత్రలు, వారు ప్రకటించిన మ్యానిఫెస్టోలు? ఇవేవీ పరిగణలోకి తీసుకోకుండా ఢిల్లీలో కూర్చుని సర్వే నివేదిక వండి వార్చినట్లు ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టిడిపి, జనసేన పొత్తులు, వివిధ సామాజిక వర్గాల ప్రజలపై వాటి ప్రభావాన్ని కూడా సర్వే పట్టించుకోనట్లు లేదు. ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మధ్యతరగతి ప్రజలు ఆగ్రహంగా ఉన్న విషయాన్ని ఈ సర్వే పరిగణలోకి తీసుకోలేదని స్పష్టంగా తెలుస్తోంది.తెలంగాణలో సైతం బిఆర్ఎస్ సర్వేల మాయలో పడిపోయింది. దాదాపు గత ఐదు సంవత్సరాలుగా వచ్చిన మెజారిటీ సర్వేలు కెసిఆర్ హ్యాట్రిక్ కొడతాయని చెప్పుకొచ్చాయి.



## తిరుమల కానుకలు దారి మళ్లింపా

తిరుమల, డిసెంబర్ 15,రాష్ట్రం ఆర్థికంగా దూసుకుపోతోందని వైసీపీ సర్కార్ చెబుతోంది. రాష్ట్రంలో వృద్ధిరేటు పెరిగిందని.. దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, సకల శాఖ మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి చెబుతుంటారు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఎంతలా అంటే తిరుమల తిరుపతి దేవస్థానానికి వచ్చే కానుకలను తిరుపతి నగరపాలక సంస్థ అభివృద్ధికి మళ్ళించేదాకా మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రావడం దారుణం.ఎన్నో దశాబ్దాలుగా ఎన్నో ప్రభుత్వాలు కొలువు తీరాయి కానీ.. ఏనాడు తిరుమల తిరుపతి దేవస్థానం కానుకల విషయంలో ఏనాడు.. ఏ ప్రభుత్వము కలుగజేసుకున్న దాఖలాలు లేవు. కానీ వైసీపీ ప్రభుత్వం ఈ సాహసం చేసింది. తిరుపతి నగరంలో రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య పనుల కోసం భక్తులు సమర్పించుకున్న కానుకలలో.. రూ.100 కోట్లు తీసి తిరుపతి కార్పొరేషన్ కు అందించింది. అంతటితో ఆగలేదు. ఏటా కానుకలలో ఒక్క శాతం నిధులను తిరుపతి కార్పొరేషన్కు ఇవ్వాలని తీర్మానించింది. కానీ విమర్శలు వెల్లువెత్తడంతో ఆ ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకుంది.అయితే భక్తుల కానుకల విషయంలో అలవాటు పడిన వైసిపి సర్కార్ ఎంత దాకా అయినా తెగిస్తుందని? బిజెపి నేత భాను ప్రకాష్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దేవాదాయ చట్టంలో సెక్షన్ 111 ప్రకారం తిరుమల శ్రీవారి ఆదాయాన్ని ఇతర అవసరాలకు మళ్లించడం విరుద్ధమని.. ఇకపై టీటీడీ నిధులను మళ్లించకుండా ఆదేశించాలని పిటిషన్ లో కోరారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు టీటీడీ నిధులను తిరుపతి పారిశుద్ధ్య పనులతో సహా ఇతర అవసరాలకు ఉపయోగించకూడదని స్పష్టం చేసింది. దీనిపై టిటిడితోపాటు తిరుపతి కార్పొరేషన్ లకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. దీంతో జగన్ సర్కార్ కు ఝలక్ తగిలినట్లు అయ్యింది.

## 10 రోజుల పాటు హిందూ ధర్మ ప్రచారం

విజయవాడ, డిసెంబర్ 15, హిందూ ధర్మప్రచారంతో పాటు, శ్రీ శోభకృత్ నామ సంవత్సర భవానీ దీక్షకు సంబంధించిన ధర్మ ప్రచారం చేయడానికి ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. అమ్మవారి ధర్మ ప్రచార రథాన్ని ప్రజలవద్దకు తీసుకుని వెళ్ళడానికి శ్రీకారం చుట్టింది. వైదిక కమిటీ ఆధ్వర్యంలో ఏపీలోని వివిధ గ్రామాల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించడానికి ఈ రోజు దుర్గామల్లేశ్వర స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి ప్రచర రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె ఎస్ రామరావు తదితరులు పాల్గొన్నారు,ఈ ప్రచారం రథం 24వ తేదీ వరకూ 10 రోజుల పాటు విజయవాడ నుంచి శ్రీకాకుళం జిల్లాలోని వివిధ గ్రామాల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఏ రోజు ఏ ఎయె ప్రాంతాల్లో అమ్మవారు పూజలను అందుకోనున్నారో పూర్తి వివరాలను తెల్సుకుందాం..

17-12-2023 న ఏ.బి కాలనీ , బుట్టావారి వీధి , పూదేడు
18-12-2023 న కొత్తవలస , చాపల ఉప్పాడ
19-12-2023 న తాళ్ళవలస , చీపురుపల్లి , శ్రీకాకుళం ,అరసవిల్లి
20-12-2023 న నరసన్నపేట ,పోలాకి , రాజారాంపురం , కొత్తరేవు ,కొరివిపేట ,గుల్లవానిపేట ,ఉమ్మలాడ,పిన్నింటిపేట, సంతబొమ్మాళి, టెక్కలి
21-12-2023 న పలాస,మిలియాపుట్టి,పర్లాకిమిడి,పాతపట్నం,హిరమండలం,శుభలై,కొత్తూరు, సీతంపేట
22-12-2023 న పాలకొండ , ఆముదాలవలస,వీరఘట్టం ,నాగూరు
23-12-2023 న గిజబ, పార్వతీపురం,బొబ్బిలి
24-12-2023 న గొల్లపల్లి , గజపతినగరం, విజయనగరం

అయ్యా గ్రామములలోని ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావలసినదిగా చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వాహణాధికారి కె ఎస్ రామ రావు కోరారు.

## అనంత వైసీపీలో టెన్షన్...

అనంతపురం, డిసెంబర్ 15,రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. తెలంగాణలో అధికార పార్టీ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు కేటాయించి బోల్తాపడడంతో ఆంధ్రప్రదేశ్ లో అధికార పార్టీ ప్రజా వ్యతిరేకత ఉన్న నేతలను స్థానాలను మార్చాలని ప్రక్షాళన మొదలుపెట్టింది. ఇప్పటికే పార్టీలోని 50 మంది ఎమ్మెల్యేలకు టికెట్లు లేవని చెప్పకనే చెప్పింది. మరో 35 మందికి ప్రస్తుతం ఉన్న స్థానంలో కాకుండా మరోచోట నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తోంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సిట్టింగ్ లను మార్చడం ద్వారా సొంత పార్టీ నాయకులు కార్యకర్తలలో ఉన్న వ్యతిరేకతను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆరుగురు ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టికెట్ అవకాశాలు కనిపించడం లేదు. ఈ ఆరుగురికి టికెట్లు ఇస్తారా లేదంటే మరో స్థానం నుంచి పోటీ చేయిస్తారా అన్న చర్చ కొనసాగుతోంది. ప్రస్తుతం పార్టీలో జరుగుతున్న పరిణామాలు చూసుకుంటే వచ్చే ఎన్నికల్లో ఎవరు ఎంత మేరా ఖర్చు పెట్టుకోగలరు అనే అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. సిట్టింగులకు విజయ అవకాశాలు తక్కువగా ఉన్నాయని ఐ పాక్ ఇచ్చిన సర్వే ఆధారంగా కొందరిని మార్చేయవచనంలో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. గుంతకల్లు ఎమ్మెల్యే వెంకట్రాంరెడ్డి కుటుంబంలో ఐదుగురికి పదవులు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో గుంతకల్ టికెట్ వేరే సామాజిక వర్గానికి ఇవ్వాలన్న ఆలోచనలో పార్టీ ఉన్నట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి మాత్రం తన కూతురు నైరుతి రెడ్డికి టికెట్ ఇవ్వాలని అధిష్టానం ముందు తన ప్రతిపాదన ఉంచారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్ర రెడ్డికి టికెట్ వచ్చే అవకాశాలు తక్కువ కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు ఉన్న నేపథ్యంలో కొత్త వ్యక్తిని బరిలోకి దింపాలని ఆలోచన అధిష్టానం చేస్తుంది. రాయదుర్గంలో వాల్మీకి బోయలు అధిక సంఖ్యలో ఉండడంతో అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను రాయదుర్గం నుంచి పోటీ చేయిస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. మాజీ మంత్రి పెనుగొండ ఎమ్మెల్యే ఎనుగొండలో వైసిపి లోని అంతర్గత పోరుతో రెండు వర్గాలుగా చీలిపోయాయి. ఈసారి శంకర్ నారాయణ కు టికెట్ కేటాయిస్తే మరో వర్గం పార్టీకి పని చేయమని బహిరంగంగానే చెప్పుకొచ్చారు. కదిరి నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో ముస్లిం ఓటర్లు ఉండడంతో ఈసారి ముస్లింలకు టికెట్ కేటాయించాలని వైసీపీ అధిష్టానం చూస్తోంది. ప్రస్తుత కదిరి ఎమ్మెల్యే సిద్దరెడ్డి పై కొంత వ్యతిరేకత ఉంది. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి వచ్చే ఎన్నికల్లో టికెట్ కష్టమేని జోరుగా ప్రసారం జరుగుతుంది. సింగనమల నుంచి ఈసారి కొత్తవారికి టికెట్ కేటాయించాలని అధిష్టానం భావిస్తుంది. చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఓ డిఎస్పీకి సింగనమల టికెట్ ఇస్తారని ప్రచారం సాగుతుంది. మడకసిర ఎమ్మెల్యే తిప్పే స్వామికి సొంత పార్టీ నేతలే ఈసారి టికెట్ ఇవ్వకూడదని పార్టీ నాయకులకు డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా వల్లభాయ్ పటేల్ మరియు పొట్టి శ్రీరాములు వర్ధంతి...




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 15 డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ మరియు అమరజీవి పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ తెలుగు రాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేబట్టి, డిసెంబర్ 15న అసువులు బాసిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. అలాగే మాట మీద నిలబడే వ్యక్తి, ముక్కు సూటిగా మాట్లాడే మనిషి, ఉక్కు మనిషి గా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, కేంద్ర హోంశాఖ మంత్రి గా పనిచేసి, ఆరోజుల్లో సంస్థానాలను విలీనం చేసి, భారతదేశంలో వినూత్న ఆలోచనలకు అనుగుణంగా పనిచేసిన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. వీరికి గుర్తు గా 182 మీటర్ల ఎత్తు ఉండే ఐక్యతా చిహ్నం కు గుర్తు గా భారీ విగ్రహాన్ని ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు గుజరాత్ నందు ఏర్పాటు చేశారు. వీరికి భారతరత్న అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్, సుబ్బారెడ్డి, రవిశేఖర్, వెంకటరమణ వెంకట లక్ష్మి, రాధ, అనంత శ్రీనివాసులు, అల్లిపీరా, రఘునాథ్, ఎస్తేరమ్మ, లక్ష్మికాంతరెడ్డి, భూకాంతరెడ్డి, మద్దిలేటి, సుబ్బరాయుడు, మధుసూదన్ రెడ్డి, విజయకుమార్,సుభాన్, శ్రీనివాసులు, జయసుబ్బరాయుడు, బాబు, ఆదినారాయణ, సురేష్, లీలావతమ్మ, సంజీవరెడ్డి, రమేష్, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి, భారతి, లక్ష్మి ప్రభావతి, హుస్సేన్ భాను, ముని రాజు, ప్రసాద్, రావు, మహేష్, అల్లిపీరా, తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారం మరువలేనిది...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 15 మానవ సేవే మాధవ సేవ అంటూ డోన్ పట్టణ పరిసర ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న స్ఫూర్తి సేవా సమితికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని, దాతల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు స్ఫూర్తి మధు అన్నారు. డోన్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో రోడ్ సైడ్ యాచించుకుంటూ చలికి ఇబ్బంది పడుతున్న ఓ నిరుపేద కుటుంబానికి కావాల్సిన స్వెటర్స్, దుప్పట్లను డోన్ పట్టణానికి చెందిన అజ్ఞాత దాతల సహకారంతో అందించడం జరిగింది. అలాగే స్థానిక యస్.యమ్ బేకర్స్ మరియు వి.డి ట్రేడింగ్ యజమానుల సహకారంతో డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో గల గర్భిణీలకు, బాలింతలకు బ్రెడ్ పాకెట్లు అందించారు. అనంతరం సాయిరామ్ హాస్టల్ యజమాని నందికేశ్వర రావు సహకారంతో జంగాల కాలనిలో అన్నదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సహకారం అందించిన దాతలకు స్ఫూర్తి సభ్యులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు జగదీష్, అంజి యాదవ్, వసంత్, భాస్కర్, వాసు, వెంకటరాముడు, ప్రవీణ్, కొండపేట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపిలో చేరిన వైకాపా ఎమ్మెల్యేలు

### పార్టీలోకి ఆహ్వానించిన చంద్రబాబు

అమరావతి,డిసెంబర్15): వైకాపా ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి దంపతులు శుక్రవారం టీడీపీలో చేరారు. వీరిని గతంలోనే వైకాపా సస్పెండ్ చేసింది. ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి సమక్షంలో తెలుగుదేశం

పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యేల అనుచరుల సారథ్యంలో భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. చంద్రబాబు చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకున్నారు. వీరితోపాటు మాజీ ఎమ్మెల్సీ, చేనేత సంఘ నాయకుడు బూదాటి రాధా కృష్ణయ్య తో పాటు 6 నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన వైకాపా ద్వితీయ శ్రేణి నేతలు టీడీపీలో చేరారు.

# నాలుగవ రోజు దీక్షలో భాగంగా అంగన్వాడీలు భిక్షాటన....





విభారే న్యూస్ డోన్మా ప్రతినిధి :- డిసెంబర్ 15 అంగన్వాడీల రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె డోన్ పట్టణంలో నాలుగవ రోజు కొనసాగింది. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం ,పట్టణ,మండల అధ్యక్షులు లక్కీశ్రీకాంత్,పి.రామాంజనేయులు,ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కోయిలకొండ నాగరాజు,అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు సులోచన, రహమద్బి,సుమలత,సుభద్ర,అంగన్ వాడీ కార్యకర్తలు,ఆయాలు పాల్గొని స్థానిక తహసిల్దార్ కార్యాలయం పరిసరాలలో వినూత్న రీతిలో భిక్షాటన చేసిన అనంతరం ఎమ్మార్వో కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసిల్దార్ మధు సుధాకర్ కి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.అనంతరం అంగన్వాడి కార్యకర్తలు అందరూ బేతంచెర్ల లో సమ్మెలో పాల్గొనడానికి తరలి వెళ్లారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలకు కనీస వేతనాలు కూడా చెల్లించడం లేదన్నారు.నిరంతరం నిత్యావసర సరుకుల ధరలు,పెట్రోల్,డీజల్, గ్యాస్,ఆర్టీసీ,రైల్వే ధరలు పెరుగుతున్నాయని వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. అంగన్వాడీ వర్కర్లు,మినీ వర్కర్లు,హెల్పర్లు ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనాలతో జీవనం గడపడం కష్టంగా ఉందన్నారు.అంతే కాకుండా అంగన్వాడి సెంటర్ల నిర్వహణకు సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. తెలంగాణా కంటే రూ.1000/-లు ఎక్కువ వేతనం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి హామి నెరవేరలేదని 2022 లోనే సుప్రీంకోర్టు గ్రాట్యూటీ అమలు చెయ్యాలని తీర్పునిచ్చిందని మన రాష్ట్రంలో మాత్రం అమలు చెయ్యటం లేదన్నారు.గత 46 సం?ల నుండి పనిచేస్తున్న అంగన్వాడీలు కనీసం సర్వీసులో ఉండి చనిపోతే మట్టి ఖర్చులు కూడా ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం అందరికీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా అమలు చెయ్యటంలేదన్నారు.అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు వివిధ రకాల యాప్లు తెచ్చారని ఫోన్లు పనిచేయక,ట్రైనింగ్ ఇవ్వక, ఏజెన్సీ,మారు మూల ప్రాంతాల్లో నెట్ సిగ్నల్స్ లేక అంగన్వాడీలు మానసిక వత్తిళ్లకు గురి అవుతున్నారని ఈ పరిస్థితుల్లో అంగన్వాడీలు నాలుగున్నర సంవత్సరాలుగా అనేక రకాలుగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.అందుకే గత్యంతరం లేని పరిస్థితులలో సమ్మె అనివార్యమైందని అన్నారు.ఆర్థిక శాఖ మాత్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గత మూడు రోజులుగా డోన్ పట్టణంలో పర్యటిస్తున్నారని వారు ప్రాతినిధ్యం వహిస్తున్న సొంత నియోజకవర్గం కనుక అంగన్వాడీల సమ్మెపై స్వయంగా దీక్షా శిబిరాలు సందర్శించి స్పందిస్తారని ఆశించామని స్పందించకపోవడంతో నిన్నటి దినం వారి కాన్వాయ్ ని అడ్డుకొని వినతి పత్రం ఇవ్వడం జరిగిందనిఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ మంత్రివర్గంలో చర్చించి సామరస్యంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని,అయితే అదే సందర్భంలో సిఐటియు,అంగన్వాడీనాయకుల పైన కేసులు పెట్టించడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు.ఏది ఏమైనా కేసులకు భయపడేది లేదని సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు అంగన్వాడీల సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు అనంత విద్యార్థుల ఎంపిక





రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఆళ్లగడ్డ ప్రతినిధి డిసెంబర్ 15 విభారె న్యూస్ : ఆళ్లగడ్డ పట్టణంలో ఈనెల13వ తేదీన నిర్వహించిన జూనియర్ టార్గెట్ బాల్ జిల్లా జట్టుఎంపికపోటీలలోఅనంత కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. అండర్ 19 బాలుర విభాగంలో విద్యార్థులు సాదిక్, వంశి, సిరిల్, సంతోష్, ఇర్ఫాన్, నరసింహ, గురు, మహేష్, నరేంద్ర రెడ్డి, నరసింహ, చరణ్ లు, అండర్ 19 బాలికల విభాగంలో విద్యార్థినిలు బేబీ, లక్ష్మి, స్రవంతి, మోహిత, కావ్య,మధులత, షాజిదా, సల్మా, నాగ మల్లిక, గంగా లక్ష్మి, సాయి ధరణి, శివాని రెడ్డి, ఆదిలక్ష్మి, శృతి, నవీన లు ఈనెల 17న సత్యసాయి జిల్లా ధర్మవరంలో జూనియర్ రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీలలో పాల్గొంటారని అనంత విద్యాసంస్థల అధినేత రామ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని పొందడమే కాకుండా భవిష్యత్తులో క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తుకు ఈ క్రీడలు ఎంతో తోడ్పడుతాయని, మా కళాశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో కూడా ఎప్పుడు ముందుంటారన్నారు. అనంతరం పోటీలకు ఎంపిక అయిన విద్యార్థిని విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలలో కూడా విజయం సాధించాలని ప్రోత్సహించారు.కళాశాలవిద్యార్థిని విద్యార్థులనుమరియువారివారి ప్రతిభకు కృషిచేసిన కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటరమణ ను అభినందించారు

# తాసిల్దార్ కార్యాలయం ముందు బైఠాయింపు...

## అంగన్వాడి సెంటర్స్ తెరిస్తే అడ్డుకుంటాం.. ఏఐటీయూసీ




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :-డిసెంబర్ 15 డోన్ పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ స్థానిక ఐసిడిఎస్ ఆఫీస్ నుండి తహసీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి గంటకు పైగా తాసిల్దార్ కార్యాలయం నందు బైటాయించడం జరిగింది అనంతరం తాసిల్దార్ విద్యాసాగర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లాప్రధాన కార్యదర్శి సుంకయ్య, డోన్ కార్యదర్శి అబ్బాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి నారాయణ అంగన్వాడ్ యూనియన్ నాయకురాళ్లు సుగుణమ్మ, జూలేఖ, ఎస్తేరు మాట్లాడుతూ గత 4రోజుల నుండి సమ్మె చేస్తున్న నామ మాత్రంగా చర్చలు జరిపి ఒక్క సమస్య పరిస్కారం చేయకుండా చివరికి అంగన్వాడీ సెంటర్స్ ను సచివాలయం ఉద్యోగులు, పంచాయితి రాజ్, మునిసిపల్ ఉద్యోగులతో ఓపెన్ చేసి డ్యూటీ చేయించడం ప్రభుత్వం చేతగానితనం, సిగ్గుచేటు అని వారు అన్నారు. ఇప్పటి వరకు సమ్మె శాంతియుతంగా జరిగింది సెంటర్స్ ఓపెన్ చేస్తే అడ్డుకుంటాం జరిగే పరిణామలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి అని వారు హెచ్చరించారు. తెలంగాణ కన్నా 1000రూపాయలు ఎక్కువ ఇస్తాను అని హామీ ఇచ్చి సిగ్గు లేకుండా మాట తప్పుతార పచ్చి మోసం, అన్యాయం అని ఆగ్రహించారు. కనీసవేతనం 26వేలు ఇచ్చి, గ్రాట్యుటి, పెన్షన్, మినీ సెంటర్స్ మెయిన్ సెంటర్సగా మార్చాలి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5లక్షలు ఇచ్చి,వయసు 62సంవలకు పెంచాలి, వేసవి శేలవులు ఇవ్వాలి.ఇప్పటికైనా చర్చలు జరిపి పరిస్కారం చేయాలి లేని పక్షాములో సమ్మె ఉద్రుతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో సిపిఐ నాయకులు రామ్మోహన్,ఏ ఐ ఎస్ ఎఫ్ నాయకులు సిద్దు, ఏ ఐ వై ఏఫ్ నాయకులు విజయ్ అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా కాంగ్రెస్ తోనే సాధ్యం...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 15 డోన్ నియోజకవర్గం ఇందిరాంపల్లి గ్రామం నుంచి చనుగొండ్ల, యెస్.గుండాల,తాడూరు, ఎద్దుపెంట గ్రామాలలో డోన్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గార్లపాటి మద్దిలేటి స్వామి ఆధ్వర్యంలో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను మరియు గ్రామీణ స్థాయిలో స్థానిక సమస్యలపై పోరాటం చేయడానికి ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందని అలాగే 2024లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు మూడు లక్షల వరకు రుణమాఫీ ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాయలసీమకు ఉత్తరాంధ్రకు వందేలు గండి తరహా ప్యాకేజీ మరియు వంట గ్యాస్ 500 రూపాయలకే ఇస్తామని హామీని ప్రజలకు తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి యు.జనార్ధన్, సలహాదారులు ఎం జయరాముడు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు వై.శేఖర్, సీనియర్ నాయకులు శేషయ్య , జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి పి శివ రాముడు, ప్యాపిలి మండలం బిసి సెల్ అధ్యక్షులు మహేంద్ర నాయుడు , మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు జలదుర్గం అధ్యక్షులు నాగరాజు, సోషల్ మీడియా నియోజకవర్గం మధు, పవన్,పాల్, ఉదయ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## అశేష రుచులతో లక్కీ9 తాడిపత్రి బిర్యాని హోటల్ ప్రారంభించిన కమిషనర్ ఏ.భార్గవ్ తేజ





కర్నూలు నగరంలోని,వెంకటరమణ కాలనీ,పంప్ హౌస్ వద్ద శుక్రవారం యజమాని కె.సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో లక్కీ 9 తాడిపత్రి బిర్యానీ హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటుచేశారు.కార్యక్రమానికి కమిషనర్ ఎ.భార్గవ్ తేజ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా యజమాని కె.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు ప్రజలకు అందుబాటు ధరల్లో లక్కీ 9 తాడిపత్రి బిర్యానీ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. 99రకాల నాణ్యమైన,రుచి కరమైన దమ్ బిర్యానీ వంటకాలు తమ హోటల్ లో లభిస్తాయని చెప్పారు. ఇప్పటికే అనంతపురంలో 5బ్రాంచ్ లు విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు.అదేవిదంగా కర్నూలులో రెండు బ్రాంచ్ లు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి బ్రాంచ్ గా వెంకట రమణ కాలనిలో నేడు,రెండవ బ్రాంచ్ గా నంద్యాల చెక్ పోస్ట్ ప్రాంతంలో ఈ 28న ప్రారంబించడం జరుగుతుందని చెప్పారు. కావున ప్రజలు లక్కీ 9 తాడిపత్రి బిర్యానిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో హోటల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాల పిల్లలకు లేటెస్ట్ టెక్నాలజీ విద్య ను దూరం చేయడమే పెత్తందార్ల కుట్ర.. ఎమ్మెల్యే ఎర్రకోట

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబర్ 15,బడుగు,బలహీన, మైనారిటీ వర్గాల పిల్లలకు లేటెస్ట్ టెక్నాలజీ విద్య ను దూరం చేయడమే పెత్తందార్ల కుట్రఅని, అందులో భాగంగానే రామోజీరావు తమ పత్రికలో పిల్లలకు ప్రభుత్వం ఇచ్చిన ల్యాప్ ట్యాప్ లతోచేదిపోతున్నారని రాతలు రాస్తున్నారని, ఇది ముమ్మాటికి పెత్తందారుల కుట్ర అని కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే స్వగృహం నందు శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూపేద బడుగు బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొరకు, ఉన్నత స్థాయి చదువులు చదివి విదేశీ విద్యను సైతం పోటీ పడి అందుకోవాలని మంచి ఉద్దశ్యంతో సీఎం జగన్మోహన్ రెడ్డి ల్యాప్ ట్యాప్ లు ఇస్తే వాటి వల్ల పిల్లలు చెడి పోతున్నారని రామోజీ రావు పత్రికలో రాయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. మరి విదేశాల్లో చదివే రామోజీ రావు మనువళు ,చంద్రబాబు మనవళ్ళు, పవన్ కళ్యాణ్ పిల్లలు ఇలాంటి ల్యాప్ ట్యావ్ లు చూసి చెడిపోయారా అని సూటిగా ప్రశ్నించారు.సమాజం లో బడుగు,బలహీన, మైనారిటీ వర్గాల పిల్లలను బానిసలుగా చూసేందుకే ఇది ముమ్మాటికి పెత్తందార్ల కుట్ర అని అన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**